కూటమి పాలనలో ఎనీ టైం మద్యం!

అధికారంలోకి వచ్చేందుకు కూటమి పార్టీల నాయకులు వందలాది హామీలను గుప్పించారు. విశ్వసించిన ప్రజలు తమ బతుకులు బాగు చేస్తారు అని భావించి కూటమి పార్టీలకు పట్టం కట్టారు. అధికారంలోకి వచ్చాక కూటమి నాయకులు ధనార్జనే ధ్యేయంగా.. ప్రజల జేబులను ఖాళీ చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నారు. అధికారంలోకి దాదాపు ఏడాది అవుతున్న హామీలకు దిక్కులేదు కానీ.. ఉద్యాన కేంద్రంగా ఖ్యాతి గడించిన కోడూరు నియోజకవర్గాన్ని మాత్రం బెల్ట్ షాపుల అడ్డాగా మార్చేశారు. 24 గంటలు మద్యాన్ని అందుబాటులోకి తెచ్చి కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తున్నారు.



- గ్రామాల్లో వెలిసిన బెల్ట్ షాపులు
- తెల్లవారుజామునే తెరుచుకుంటున్న బెల్ట్ దుకాణాలు
- బాటిల్‌పై రూ.20 నుండి రూ. 50లు అధిక ధరలకు విక్రయం
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : రైల్వేకోడూరు నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాల్లో మద్యం ఏరులై పారుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మద్యం షాపులు ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పడంతో ఇష్టారాజ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో బెల్టు షాపులు ఏర్పాటు చేసి మద్యం విక్రయాలను యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. అత్యవసర సమయంలో వైద్య సేవలు ప్రజలకు అందడం లేదు కాని ఎనీ టైమ్ గ్రామీణ ప్రాంతాలలో మద్యం మాత్రం అందుబాటులో ఉంటూ కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తున్నాయి.

అడ్డూ అదుపులేకుండా వెలుస్తున్న బెల్టు షాపులు

రైల్వేకోడూరు నియోజకవర్గంలోని పుల్లంపేట రైల్వేకోడూరు, ఓబులవారిపల్లి, చిట్వేలి, పెనగలూరు మండలాల్లో గ్రామీణ ప్రాంతాల్లో మద్యం ఏటీఎంల వెలిశాయి. కూటమి అధికారంలో ఉండటంతో నాయకులు ఆదాయమే ధ్యేయంగా మద్యాన్ని పచ్చని పల్లెలకు చేర్చి గ్రామాల వాతావరణాన్ని భ్రష్టుపట్టిస్తున్నారు. ఉదయం 5 గంటల నుంచి అర్ధ రాత్రి కూడా బెల్టు షాపు ద్వారా మద్యం విక్రయాలు జోరుగా సాగిస్తున్నారు. ప్రతి మద్యం బాటిల్‌పై రూ.50 వరకు అధికంగా వసూలు చేస్తూ మందు బాబుల జేబుకు చిల్లుపెడుతున్నారు. బెల్టు షాపుల నిర్వాహకులు అధికారుల చేతులు తడుపుతుండటంతో వీటిని పట్టించుకున్న పాపానపోలేదు. దీంతో కుటుంబంలో ఇరుకు, ఇబ్బందులు ఎదురవుతున్నాయని పల్లెల్లో బెల్ట్ షాపులు తీసుకొచ్చి కుటుంబాల్లో చిచ్చు రాజేశారని మండలంలో పలువురు మహిళలు విమర్శలు గుప్పిస్తున్నారు.

కూటమి నాయకుల కనుసన్నల్లోనే..

గ్రామీణ ప్రాంతాల్లో కూటమి నాయకులకు చెందిన అనుకూలమైన వారికే బెల్టు షాపుల ఏర్పాటు చేసుకునేలా నిర్ణయించారు. దీంతో వారు ఇష్టారాజ్యంగా విక్రయాలు జరుపుతున్నారు. మద్యం షాపుల నుంచి బాటిల్‌పై పది రూపాయలు అధికంగా చెల్లించి గ్రామీణ ప్రాంతాల్లో బాటిల్‌పై రూ. 50లు వరకు ధర పెంచి అమ్ముతున్నారు. విచ్చలవిడిగా మద్యం విక్రయాలను అడ్డుకోగా పోలీసులను సైతం కూటమి నాయకులు తాలుకా కావడంతో అటు వైపు వెళ్లకుండా చోద్యం చూస్తున్నారు.

బెల్టు షాపు ఉన్న గ్రామాలు

నియోజకవర్గంలోని ప్రధానంగా పుల్లంపేట మండలం, వత్తలూరు, దళవాయిపల్లి, దొండ్లోపల్లి, బలిజపల్లి, ఓబులవారిపల్లి, మంగంపేట, గోవిందంపల్లి, బొమ్మవరం, కొర్లకుంట, చిన్నఓరంపాడు, గాదెల, వైకోట, బాలిరెడ్డిపల్లి, పెనగలూరు మండలంలో నల్లపరెడ్డిపల్లి, ఓబిలి, పెనగలూరు, కొండూరు, చక్రంపేట, చిట్వేలి, నగిరిపాడు, వెంకటరాజుపల్లి, సిద్దారెడ్డిపల్లి, నాగవరం, రైల్వేకోడూరు పట్టణం, శెట్టిగుంట దాదాపు అన్ని పంచాయతీలలోని గ్రామాలలో బెల్టు షాపులను ఏర్పాటు చేసి మద్యం విక్రయాలను చేస్తున్నారు. మామూళ్ల మత్తులో ఉన్న ఎక్సైజ్ అధికారులు బహిరంగంగా గ్రామాలలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామీణ ప్రాంతంలోని బెల్టుషాపుల విక్రయాలపై ఉక్కుపాదం మోపి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

మద్యం మత్తులో కుటుంబాలు చిత్తు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామీణ ప్రాంతాలలో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. దీంతో ప్రజలు మద్యానికి బానిసై కుటుంబాలు చిత్తు అవుతున్నాయి. పేద ప్రజలు సంపాదించిన డబ్బులు మద్యానికే ఖర్చు పెడుతున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు విక్రయదారులతో కుమ్మక్కయ్యారు. అక్రమంగా ఏర్పాటు చేసుకున్న బెల్టు షాపులపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

– పందుగోల మణి అన్నమయ్య జిల్లా, బీకేఎంయూ అధ్యక్షులు

బెల్టు షాపులను అరికట్టాలి



నియోజకవర్గంలోని దాదాపు అన్ని గ్రామాలలో బెల్టు షాపులను ఏర్పాటు చేశారు. తమను అడిగేవారు ఎవరనే ధోరణిలో ఇష్టారాజ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. అధికారులు చూస్తూ ఏమీ చేయకుండా వదిలేస్తున్నారు. దీని వెనుక ఆంతర్యం ఏమిటో వారే చెప్పాలి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నత స్థాయి జిల్లా అధికారులు చర్యలు తీసుకొని గ్రామాలలో ఏరులై పారుతున్న మద్యాన్ని అరికట్టి పేదల కుటుంబాలను ఆదుకోవాలి.

– జ్యోతి చిన్నయ్య, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి

క్లుప్తంగా

5న వాహనాల వేలం

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లె ప్రోహిబిషన్ ఎక్సైజ్ శాఖ కార్యాలయం పరిధిలోని వివిధ సారా కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 5న కార్యాలయం వద్ద వేలం పాటను నిర్వహించనున్నట్టు ఎక్సైజ్ శాఖ పోలీస్ సిబ్బంది శుక్రవారం తెలిపారు. మూడు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను వేలం వేయడం జరుగుతుందన్నారు. వేలంపాటలో పాల్గొనదల్చినవారు ముందుగా ఐదు వేల రూపాయలు నగదు ధారావత్తును చెల్లించాలన్నారు. వేలం పాటలో వాహనాలు దక్కని వారికి తిరిగి నగదును అందజేస్తామన్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు వేలంపాట జరుగుతుందని ఎక్సైజ్ శాఖ సిబ్బంది తెలిపారు.

మల్లూరమ్మకు అభిషేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

చిన్నమండెం : మండల పరిధిలోని కొత్తపల్లె, మల్లూరు గ్రామ పంచాయతీల సరిహద్దులో వెలసియున్న శ్రీ మల్లూరమ్మకుఅభిషేక పూజలను నిర్వహించారు. శుక్రవారం కావడంతో అమ్మవారి మూలవిరాట్‌మూర్తిని పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. అనంతరం ఆలయ అర్చకులు పలు పూజాది క్రతువులను నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

రక్తదానం చేసి ప్రాణాలు కాపాడండి



రాయచోటి టౌన్ : ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి సాటి మనుషుల ప్రాణాలను కాపాడాలని హెల్పింగ్ హ్యాండ్స్ బ్లడ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మైనుద్దీన్ కోరారు. శుక్రవారం కలకడ బాటవారిపల్లెకు చెందిన సునీత అనే గర్భిణీ కాన్పు కోసం రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. ఆమెకు కాన్పు చేయడానికి రక్తం కావాలని డాక్టర్లు సూచించడంతో ఆమె బంధువులు హెల్పింగ్ హ్యాండ్స్‌ను సంప్రదించారు. వారు స్పందిం షేక్ మామా అనే యువకుడిని సంప్రదించి రక్తదానం చేయించారు.

అమానత్ సేవా సొసైటీకి అవార్డు



అవార్డును అందుకుంటున్న అతావుల్లా

రాయచోటి అర్బన్ : గత పదేళ్లుగా ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టడంతో పాటు ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ఆదుకుంటూ వస్తున్న పట్టణానికి చెందిన అమానత్ సేవా సొసైటీకి యంగ్ ఇండియన్ సేవా పురస్కార్ అవార్డు లభించింది. గురువారం తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలోని నెహ్రూ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు అతావుల్లా అవార్డును అందుకున్నారు.

మన దేశం కళలకు పుట్టినిల్లు



డాక్టర్ బయారెడ్డిని సన్మానిస్తున్న కార్యక్రమ నిర్వాహకులు

రాయచోటి టౌన్ : మన దేశం కళలకు పుట్టినిల్లు అని ప్రముఖ వైద్యులు బయారెడ్డి అన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీలోని శ్రీ మహాలక్ష్మి దేవాలయంలో వేసవి విడిదిగా విద్యార్థులకు కళలను నేర్పేందుకు శ్రీ అన్నమయ్య సంగీత నాట్య కళాశాలను అన్నమయ్య జిల్లా డీఈఓ డాక్టర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సంగీత, నృత్య ప్రదర్శన పాఠశాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ బయారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కళలకు మన దేశం పుట్టినిల్లు అని పేర్కొన్నారు. వేసవి సెలవులలో విద్యార్థులు ఉన్న కాలాన్ని దుర్వినియోగం కానీయకుండా కళలను నేర్చుకొని మన సంస్కృతిని, సంప్రదాయాలను బతికించాలని చెప్పారు. అనంతరం ఆయన్ను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

5 నుంచి వాసవీ జయంతి ఉత్సవాలు

మదనపల్లె సిటీ : శ్రీ వాసవి కన్యాకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలు ఈనెల 5 నుంచి నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఓంప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాలు 9వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. 7వతేదీ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, మధ్యాహ్నం ఆర్యవైశ్య యువకులచేత బైక్ ర్యాలీ, సాయంత్రం అమ్మవారిని పుష్పపల్లకీ ఊరేంగిపు నిర్వహిస్తామన్నారు.

వైభవంగా ఆదిశంకరాచార్యుల జయంతి

రాజంపేట టౌన్ : పట్టణంలోని శంకరమఠంలో శుక్రవారం బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిశంకరాచార్యులు, శారద మాత ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలతో, ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేకంగా తయారు చేసిన వేదికపై కొలువుదీర్చారు. ఈ సందర్భంగా వేదపండితులు హరికుమార్‌శర్మ నేతృత్వంలో పురోహితులు విశేష పూజలు నిర్వహించారు. బ్రాహ్మణ వటువులకు ధర్మోపనయనాలు నిర్వహించారు. కాగా ఐదు మంది బ్రాహ్మణులు సామూహికంగా యజ్ఞోపధారణలు చేయించుకున్నారు. కాగా సాయంత్రం ఉత్సవ మూర్తులు పుర వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఇదిలావుంటే ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి ఆదిశంకరాచార్యులు, శారదామాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు డీలర్ సుబ్బరామిరెడ్డి, దండు గోపి, బొజ్జా పెంచలయ్య, గంటు మణి తదితరులు పాల్గొన్నారు.



రాజంపేట టౌన్: ప్రత్యేక అలంకరణలో ఆదిశంకరాచార్యులు, శారద మాత



రాజంపేట టౌన్: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి, మున్సిపల్ చైర్మన్ పోలా

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని కొత్తకోడూరులో వెలసివున్న ఆదిశంకార్యచార్యుల మఠంలో శుక్రవారం జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతిని కోడూరు బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పిడతల రాంమ్మోహన్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. శంకరాచార్యుల మూలవిరాట్, శివపార్వతులకు నమక చమక రుద్రాభిషేకాలు వేదపండితులు రాయపెద్ది సతీష్‌శర్మ ఆధ్వర్యంలో అర్చకులు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.



రైల్వేకోడూరు అర్బన్: స్వాములవారికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



నేలరాలిన మామిడి కాయలను పరిశీలిస్తున్న సీపీఐ నాయకుడు సిద్దిగాళ్ల శ్రీనివాసులు

లక్కిరెడ్డిపల్లి : అకాల వర్షంతో మామిడి రైతన్నకు అపార నష్టాన్ని మిగిల్చాయని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సిద్దిరేవుల గ్రామ పరిధిలోని అప్పలరాజుగారిపలికి చెందిన మామిడి రైతులు నరసింహరాజు, నరేష్ రాజు, మార్లవాండ్లపల్లికి చెందిన రవికుమార్ రెడ్డిలకు చెందిన మామిడి తోటలను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ గురువారం ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి, ఈదురుగాలుల బీభత్సం తోడవడంతో మండలంలోని మద్దిరేవుల, కస్తూరురాజుఆరిపల్లి, దప్పేపల్లి, లక్కిరెడ్డిపల్లి, కాకులవరం తదితర గ్రామాల పరిధిలోని మామిడి రైతులు తోటలో కాపులు పూర్తిగా నేల రాయిపోయాయన్నారు. పెనుగాలుల బీభత్సానికి మండలంలోని మామిడి రైతు పంట చేతికందే సమయంలో కుదేలైపోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మామిడి రైతులకు నష్టపరిహారం అందించకపోతే రైతు అప్పుల ఊబిలో కూరుకుపోతారన్నారు. ఉద్యానశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టపోయిన రైతు వివరాలను ప్రభుత్వానికి నివేదిక పంపి నష్టపరిహారం అందేలా చూడాలని వారు డిమాండ్ చేశారు.

బస్ షెల్టర్‌ను త్వరితగతిన అందుబాటులోకి తెస్తాం



కొనసాగుతున్న బస్ షెల్టర్ నిర్మాణ పనులు

పుల్లంపేట : కడప – చెన్నై జాతీయ రహదారి పుల్లంపేట బైపాస్‌లో బస్‌షెల్టర్ లేక ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఎండాకాలం కావడంతో నిలువ నీడ లేక సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రజలు అవస్థలకు గురవుతున్నారు. ప్రతిరోజు నిత్యం వేలాదిమంది ఈ రహదారి గుండా చెన్నై, బెంగళూరు, తిరుపతి, హైదరాబాద్ తదితర సుదూర ప్రాంతాలకు నిత్యం ప్రయాణిస్తూ ఉంటారు. మండలం నుంచి ప్రతిరోజు 500 నుంచి 1000 మంది నిత్యం ప్రయాణం సాగిస్తుంటారు. దీంతో ఎంపీ మిథున్‌రెడ్డి ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి సహకారంతో రూ.10 లక్షల ఎంపీపీ నిధులతో నూతన బస్సు షెల్టర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల ఇందుకు సంబంధించిన నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి. శుక్రవారం పనులను సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి పనులు పర్యవేక్షించారు. త్వరితగతిన పనులు పూర్తి చేసేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన పేర్కొన్నారు. బస్ షెల్టర్ నిర్మాణానికి అడుగులు పడటంతో స్థానికులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాలికల భవితకు 'కిశోరి వికాసం'



సుండుపల్లె: అంగన్వాడీ సిబ్బందికి సూచనలు చేస్తున్న పీఓ రామలక్ష్మి



గాలివీడు: మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సోనీ

గాలివీడు : బాలికల భవితకు కిశోరి వికాసం కార్యక్రమం ఎంతగానో దోహదపడుతోందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సోనీ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వార్డు, గ్రామ సచివాలయాల్లో ఈ నెల 2 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు బాలికలకు 12 అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి లావణ్య, అంగన్వాడీ టీచర్లు జరీనా, ఓబులమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలి

సుండుపల్లె : మండల పరిధిలోని అంగన్‌వాడీ సెక్టార్–2 పరిధిలోని యానాది కాలనీ, దూదిమాదిగపల్లె, సిద్దారెడ్డిగారిపల్లె అంగన్‌వాడీ సెంటర్లలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి (పీఓ) రామలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం కిశోర బాలికల వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల హక్కులు, రక్షణ, పోక్సో చట్టం, సైబర్ నేరాలు, ఆన్‌లైన్‌లో భద్రత, విద్య ప్రాముఖ్యత, బాల్య వివాహాలు, చిన్న వయస్సులో గర్భం దాల్చడం వలన జరిగే నష్టం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ సిబ్బందికి ఆమె సూచించారు. ప్రతి సంవత్సరం మే 2వ తేదీ నుంచి అన్ని గ్రామాలలో ఈ కార్యక్రమం నిర్వహించబడతాయని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మమ్మ, అఫీదా, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

'ఆదర్శ'ంగా నిలిచిన విద్యార్థులు



షేక్ జోయ



ఆలియా

లక్కిరెడ్డిపల్లి : 2025 – 26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏపీ మోడల్ స్కూల్‌లో ఏప్రిల్ 20వ తేదీన జరిగిన ఆరవ తరగతి ప్రవేశ పరీక్షా ఫలితాలలో సిద్దకవాళ్లపల్లికి చెందిన షేక్ జోయ 100 మార్కులకు 79 సాధించి మండల టాపర్‌గా నిలిచింది. అలాగే దిన్నెపాడు గ్రామం దూదేకులపల్లికి చెందిన ఆలియా 83 మార్కులు, సిద్ధకవాళ్లపల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన చేతన్ కుమార్ రెడ్డి మరో ముగ్గురు విద్యార్థులు ఏపీ మోడల్ స్కూల్‌కు ఎంపికకావడం జరిగింది. అనంతరం విద్యార్థులను ఎంఈఓ చక్రేనాయక్, ఎంఈఓ – 2 వెంకట సుబ్బయ్యలు అభినందించారు.

ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ తరగతులు

మదనపల్లె : గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు స్పోకెన్ ఇంగ్లీష్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ తరగతులను పినాక సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహిస్తున్నట్లు సొసైటీ ఫౌండర్ బి.యాదగిరి, ఐఆర్ఎస్ తెలిపారు. శుక్రవారం జ్ఞానోదయ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...డిగ్రీ మొదటి సంవత్సరం లేదా ఆపై చదువుతున్న విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, స్పోకెన్ ఇంగ్లీష్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, యువత వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు అవసరమైన శిక్షణ, మెలకువలను అందిస్తున్నామన్నారు. శిక్షణను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 7675246888, 8328255253 ఫోన్ నెంబర్లపై సంప్రదించాలన్నారు.

మతసామరస్యం వెల్లివిరియాలి



వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : మత సామరస్యం వెల్లివిరియాలని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని బండ్లపెంటలోని శ్రీ హజరత్ సయ్యద్ యూసుఫ్‌షా ఖాదరీ దర్గాలో ఉరుసును పురస్కరించుకుని ఆయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి చాదర్‌ను సమర్పించారు. శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ హరజరత్ సయ్యద్ యూసుఫ్‌షా ఖాదరీ దర్గాను సందర్శించడం చాలా సంతోషంగా ఉందన్నారు. హిందూ – ముస్లిం నడుమ ఐక్యతకు దర్గా నిదర్శనంగా నిలుస్తుండడం సంతోషదాయకమన్నారు. ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని ప్రార్థించానన్నారు. భక్తిశ్రద్ధలతో గంధం, ఉరుసు కార్యక్రమాలను నిర్వహిస్తున్న దర్గాకమిటీ సభ్యులను ఆయన అభినందించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, బేపారి మహమ్మద్‌ఖాన్, కొలిమి హారూన్‌బాషా, అన్నాసలీం, కొలిమి చాన్‌బాషా, షబ్బీర్, రియాజ్, ఇర్ఫాన్, ఈశ్వర్, శ్యామ్‌కుమార్, అబుజర్, నవాజ్, అయ్యవారురెడ్డి, కొత్తపల్లె ఇంతియాజ్, దర్గా కమిటీ సభ్యులు ఉన్నారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

రాయచోటి టౌన్ : పాత రాయచోటిలో వెలసిన శ్రీ పోలేరమ్మకు గ్రామ ప్రజలు బోనాలు సమర్పించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శుక్రవారం టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్ బాబు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన్ను ఆలయ ఉత్సవ నిర్వాహకులు సన్మానించారు.



పూజలు నిర్వహిస్తున్న సుగవాసి ప్రసాద్‌బాబు

నెత్తిన నిప్పుల కుంపటి

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు
- అమాంతం పెరిగిపోతున్న విద్యుత్ డిమాండ్

రాయచోటి జగదాంబసెంటర్ : రోజురోజుకూ అన్నమయ్య జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మే నెల ఆరంభం కాక మునుపే 44 డిగ్రీలకు పైగా చేరుకోవడం ఆందోళన కలిగిస్తోంది. ఏప్రిల్ నెలలోనే ఈ విధంగా ఉంటే మే నెలలో తీవ్రత ఏ స్థాయికి చేరుతుందో ఊహించుకుంటేనే భయపడాల్సి వస్తోంది. పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలతో విద్యుత్ వినియోగం కూడా గణనీయంగా పెరుగుతోంది. ఉక్కపోతతో ఫ్యాన్, కూలర్లు, ఏసీలు లేకుండా ఉండలేని పరిస్థితి ఏర్పడింది. రానున్న రోజుల్లో వినియోగం మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు

అన్నమయ్య జిల్లాలో ప్రజలు అధిక ఉష్ణోగ్రతలతో విలవిల లాడుతున్నారు. ఉదయం 10 గంటల నుంచే ఎండల తీవ్రత పెరుగుతుండటంతో ప్రజలు బయటికి రాలేకపోతున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రధాన రహదారులపై రాకపోకలు చాలా వరకు తగ్గిపోయాయి.



రాయచోటిలో మధ్యాహ్నం 12 గంటలకు ఎండవేడిమి దృష్ట్యా నిర్మానుష్యంగా ఉన్న రోడ్లు



రాయచోటి సబ్‌స్టేషన్‌లో మెయింటెనన్స్ పనులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

ఉష్ణోగ్రతలు పెరగడానికి కారణాలు

- ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో నీటి నిల్వలు తగ్గిపోయాయి. భూమిలో తేమ లేకపోవడంతో ఎండల తీవ్రతకు నేల నుంచి వేడి సెగలు పుట్టుకొస్తున్నాయి.
- అడవులు తరిగిపోతుండటం ఎండల తీవ్రత పెరగడానికి కారణమవుతోంది.
- వాహనాల సంఖ్య పెరగడంతో కార్బన్ డయాక్సైడ్ గాలిలో చేరుతుండటం మరో కారణం.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- పనులకు వెళ్లిన వారు సాధ్యమైనంత వరకు ఉదయం 11 గంటలలోపు ఇంటికి చేరుకోవాలి.
- ఎండలో బయటికి వెళ్లాల్సి వచ్చినప్పుడు గొడుగు తీసుకెళ్లాలి. కనీసం తలపైన టోపీ లేదా టువాలతో కప్పుకోవడం అవసరం. కళ్ల రక్షణ కోసం సన్ గ్లాసెస్ ఉపయోగించాలి.
- తరచూ చల్లని నీరు తీసుకోవాలి
- ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్, కొబ్బరినీళ్లు వీలైనంత వరకు ఎక్కువగా సేవించాలి
- నల్లని దుస్తులు ధరించరాదు. తెల్లని వస్త్రాలు ధరించడం మంచిది.
- మధ్యాహ్నం 11 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య శారీరక శ్రమతో కూడిన పనులు చేయరాదు.
- బాలింతలు, చిన్నపిల్లలు, వృద్ధులు ఎండలు ఎక్కువగా ఉన్నపుడు బయట తిరగరాదు.
- తలనొప్పి, తలతిరగడం, తీవ్రమైన జ్వరం కలిగి ఉండటం, మత్తునిద్ర, ఫిట్స్, పాక్షిక లేదా పూర్తి అపస్మారకస్థితి ఇవన్నీ వడదెబ్బ లక్షణాలు. వడదెబ్బ తగిలిన వెంటనే ఆస్పత్రి వెళ్లాలి వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలి.

నిరంతర విద్యుత్‌ను అందించేందుకు కృషి



ప్రస్తుతం విపరీతమైన ఎండలు కాస్తున్నాయి. దీంతో జిల్లాలో విద్యుత్ డిమాండ్ కూడా భారీగా పెరిగింది. విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకొని తాము కూడా ఎక్కడా లో ఓల్టేజీ లేకుండా చూస్తున్నాం. అవసరమైన చోట్ల అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను అమరుస్తున్నాం. సబ్‌స్టేషన్‌లలోనూ ఇబ్బందులు లేకుండా మెయింటెనన్స్ పనులు చేయిస్తున్నాం.

– చంద్రశేఖర్‌రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్, విద్యుత్ శాఖ, రాయచోటి